


ఉష్ణోగ్రత (అంచనా)

14-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	36	27
తెనాలి	37	27
నరసరావుపేట	35	27
బాపట్ల	36	28
రెంటచింతల	36	26
చీరాల	36	28

కొండవీడు కొండపై యోగాంధ్ర

- జీవితంలో యోగా ఒక భాగం కావాలి : జేసీ సూరజ్



యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, ప్రజలు

పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఉద్యోగులు, ప్రజలు

యడ్లపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొండవీడు కొండ మార్గంలోని ఘాట్ రోడ్డు యోగ ఆసనాలతో ఆకర్షణీయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025లో భాగంగా శుక్రవారం పర్యాటకశాఖ ఆధ్వర్యంలో చారిత్రక కొండవీడు కోట ఘాట్ రోడ్డులో చెక్‌పోస్టు వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీ, గ్రామీణాభివృద్ధి, ఆయుష్, వైద్య ఆరోగ్య, టూరిజం, పోలీసు తదితర శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఘాట్‌మార్గం యోగామయంగా మారింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగా ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు మరో పది మందికి తెలియచేయాలని కోరారు. డీఎఫ్‌వో కృష్ణప్రియ మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో, స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ యోగా సాధన చేయాలన్నారు. ఆనంద విహారి యోగా శిక్షకులు ఆనందరావు శిష్య బృందం వివిధ రకాల ఆసనాలు, వాటి ప్రయోజనాలను వివరిస్తూ హాజరైన వారితో సాధన చేయించింది. ఈ కార్యక్రమంలో డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత, డీఎంహెచ్‌వో రవికుమార్, పర్యాటకశాఖ జిల్లా అధికారి నాయుడమ్మ, డీఆర్‌డీఏ పీడీ యూస్సీ, తహసీల్దారు విజయశ్రీ, ఎంపీడీవో హేమలతాదేవి, కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్.. అన్వేషణ

- ఇందన నిక్షేపాల కోసం ఓఎన్జీసీ సర్వే
- పొనుగుపాడు కాల్వ ప్రాంతంలో పనులు
- ఒంగోలు నుంచి విజయవాడ వరకు 24 వేల బోర్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆయిల్ నిక్షేపాల కోసం చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్జీసీ) అన్వేషణ చేపట్టింది. ఇందనం, గ్యాస్ నిక్షేపాలను గుర్తించేందుకు విస్తృతంగా సర్వే పనులు జరుగుతున్నాయి. శాటిలైట్ నివేదికల ఆధారంగా ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్జీసీ



ఫిరంగిపురం : పొనుగుపాడులో భూముల్లో ఆయిల్ సర్వే కోసం వేస్తున్న బోర్లు

అధికారులు అన్వేషిస్తున్నారు. చమురు, గ్యాస్ నిల్వల ఉనికి, పరిమాణాన్ని నిర్ధారించడానికి ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో బోరు బావులను తవ్వుతున్నారు. ఒక్కొక్క బోరు 80 అడుగుల లోతున వేస్తున్నారు. ఒంగోలు నుంచి విజయవాడ కృష్ణానది వరకు సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు కాల్వ ప్రాంతంలోని పొలాల్లో పెద్దఎత్తున బోర్లు వేస్తున్నారు. ఈ బోర్ల నుంచి సదరు సంస్థ ఇంజనీర్లు మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతున్నారు. ఇలా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మొత్తం 24,000 బోర్లు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే 14,000 బోర్ల నిర్మాణం జరిగింది. రానున్న రెండు నెలల్లో మిగిలిన 10,000 బోర్లు వేయనున్నారు. ఒక్కొక్కబోరుకు రూ.5,600 చెల్లిస్తున్నారు. కేవలం బోర్ల నిర్మాణానికే ఓ ఎన్జీసీ రూ.13.44 కోట్లు ఖర్చు చేస్తోంది. రైతుల ఆమోదంతోనే బోర్ల నిర్మాణం చేపట్టినట్లు సదరు సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు తెలిపారు. పొనుగుపాడులో ఒకే ప్రాంతంలో పెద్దఎత్తున బోర్ల నిర్మాణం జరుగుతుండటంతో ఆ ప్రాంతాల రైతులు, ప్రజలు అక్కడ ఏమి చేస్తున్నారు.. ఎందుకు బోర్లు వేస్తున్నారనే విషయాలను పరిశీలించేందుకు, తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారు.

తల్లికి వందనం ఆనందం

సూపర్ సిక్స్‌లోని.. 'తల్లికి వందనం' విద్యా సంవత్సరం ఆరంభం రోజునే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఉదయం నుంచి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడం ప్రారంభమైంది. ఖాతాల్లో పడిన నగదు చూసు కుని తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివెరిసింది. గత వైసీపీ ప్రభు త్వం అమ్మఒడి పథకాన్ని అమలు చేసినా ఒక్కో కుటుంబంలో ఒక్కరికే అమలు చేసింది. కుటుం బంలో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పినట్లుగానే కూటమి ప్రభుత్వం ముగ్గురు, నలుగురు, ఐదుగురు పిల్లలు ఉన్న వారికి కూడా నగదు వేయడంతో ఆ కుటుంబాల్లో సంతోషాన్ని రెట్టింపు చేసింది. వైసీపీ నేతలు తల్లికి వందనం అమలుపై దుష్ప్రచారం చేయగా.. వాటిని పటాపంచలు చేస్తూ గతంలో చెప్పినట్లుగా పథకాన్ని అమలు చేయడంతో కూటమి శ్రేణులతో పాటు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులతో కలిసి కూటమి నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞత తెలిపారు. తల్లికి వందనం పేద కుటుంబాల్లో సంతోషాలను తీసుకొచ్చింది.



తల్లికి వందనం నగదు జమ చేయబడిన ముగ్గురు పిల్లలతో ఈమనికి చెందిన కంచర్ల రజిత

తల్లుల ఖాతాల్లో జమవుతున్న నగదు

- ఈపూరులో ఐదుగురున్న పిల్లల తల్లికి ఏకమొత్తంగా రూ.65 వేలు
- పిల్లలతో కలిసి హర్షం వ్యక్తం చేస్తోన్న తల్లిదండ్రులు
- సచివాలయాల వారీగా లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన
- అభ్యంతరాల స్వీకరణకు వచ్చే నెల 5 వరకు గడువు




పెదకూరపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

(గుంటూరు, గుంటూరు(విద్య), బాపట్ల - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల హామీలో ప్రధానమైన తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం జీవో విడు దల చేయగా ఆ తర్వాత నుంచి తల్లుల ఖా తాల్లో నగదు జమ అవడం ప్రారంభమైంది. శుక్రవారం ఉదయానికే గ్రామ/వార్డు సచివా లయాల్లో తల్లికి వందనం పథకానికి సం బంధించి అర్హులు, అనర్హుల జాబితాలను ప్రదర్శించారు. అలానే వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. వాటిని చూసుకుని అర్హుల జాబితాలో ఉన్న తల్లుల ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కాసేపటికి

(మిగతా 6వ పేజీలో)


5:08 pm
Your SB A/c *9296 Credited for Rs:39000.00 on 13-06-2025 17:08:17 by BRANCH Avl Bal Rs:41485.52.Don't share Card PIN/CVV -Union Bank of India



ఆనందంగా స్కూలుకు వెళుతూ

8,199 మందికి ట్రిపుల్ ధమాక

తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలోని పిల్లలందరికీ వర్తింప చేయడంపై అనుమానాలు వ్యక్తం చేసిన వారు కూడా ఆశ్చర్యపోయేలా తల్లుల ఖాతాల్లో ఏకమొత్తం గా నగదు జమ చేస్తున్నారు. ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులకు ట్రిపు ల్ ధమాక లభించింది. గుంటూరు జిల్లాలో 2131, పల్నాడు జిల్లాలో 4635, బాపట్ల జిల్లాలో 1433 మంది తల్లులకు ముగ్గురు/అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్న తల్లులు 'తల్లికి వందనం' పథకానికి ఎంపికయ్యారు. వీరిలో పలువురికి నగదు జమ కూడా అయింది. ఒక్కో బిడ్డకు రూ.13 వేల చొప్పున ముగ్గురున్న వారికి రూ.39 వేలు, నలుగురు ఉన్న వారికి రూ.52 వేల నగదు బ్యాంకు ఖాతాల్లో జమైంది. పల్నాడు జిల్లా పరిధిలో ఈ పథకం ద్వారా పెద్దసంఖ్యలో తల్లులు లబ్ధి పొందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఐదింతలు..

ఈపూరు ఎస్సీ కాలనీకి చెందిన దారా సాగర్, మేరీ దంపతులకు ఐదుగురు సంతానం కాగా వారికి రూ.65 వేలు బ్యాంకు ఖాతాలో జమ కావడంతో వారి ఆనందం ఐదింతలైంది.

8 విత్తనాల విఫణిలో.. జిల్లాకు నకిలీ మరకలు
- భద్రాద్రి కొత్తగూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు పట్టివేత
- మహబూబ్ నగర్‌లో దొరికిన బీటీ3 పత్తి విత్తనాలు
- రెండు తెలుగు రాష్ట్రాలకు గుంటూరు నుంచే సరఫరా
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థ

22 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె 6

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్ 6

ఏఎన్‌యూ పీజీ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల
- 20 వరకు పునఃమూల్యాంకనానికి అవకాశం

కొనసాగుతున్న కౌన్సెలింగ్

- మాన్యువల్‌గా నిర్వహించాలని మున్సిపల్ టీచర్ల డిమాండ్
- డీఈవో రేణుక హామీతో ఉపాధ్యాయుల ఆందోళన విరమణ
- నేటితో బదిలీ ప్రక్రియ ముగింపు.. 16న విధుల్లోకి ఉపాధ్యాయులు



సమావేశంలో కింద కూర్చుని ఆందోళన చేస్తున్న మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాల ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు జడ్పీ వద్ద రాత్రి పూట కూడా పడిగాపులు కాస్తున్నారు. మండల పరిషత్ యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పని చేసే ఎస్జీటీలకు బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ చేపట్టారు. పలు అవాంతరాలతో ఆయా ఉపాధ్యాయులు తమకు కూడా మాన్యువల్‌గానే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జడ్పీ సమావేశ మందిరంలోని కౌన్సెలింగ్ కేంద్రం వద్ద మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు పెదబాబు, డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన ఒత్తిడి కారణంగా ఇప్పటికే 80 శాతం మంది మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు పెట్టుకున్నారని దీనివల్ల వారికి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఉపాధ్యాయుల ఆందోళనతో స్పందించిన డీఈవో రేణుక మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు ఆందోళన విరమించారు. శనివారం మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా కౌన్సెలింగ్ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. సోమవారానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరతారని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

నల్లపాడులో ఫ్రైట్ డిపో ప్రారంభం

- శిలాఫలకం ఆవిష్కరించిన రైల్వే జీఎం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రైల్వే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఫ్రైట్ డిపోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ప్రారంభించారు. శుక్రవారం గుంటూరు రైల్వే డివిజన్ పర్యటనకు వచ్చిన ఆయన తొలుత నల్లపాడు రైల్వే స్టేషన్‌ని సందర్శించారు. అక్కడ ఫ్రైట్ డిపోకి శిలాఫలకం ఆవిష్కరించారు. ఇక నుంచి ఈ ఫ్రైట్ డిపోలో



డిపోని ప్రారంభిస్తున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్, డీఆర్‌ఎం సుధేష్ణసేన్

గూడ్స్ వ్యాగన్లను పరీక్షించి బీపీసీ సర్టిఫికెట్లను జారీ చేస్తారు. అలానే పాడైపోయిన వ్యాగన్లకు మరమ్మతులు నిర్వహిస్తారు. అనంతరం ఫ్రైట్ డిపో ఆవరణలో జీఎం మొక్కలు నాటారు. ఆ తర్వాత ఫైట్ డిటెక్షన్, అలర్ట్ సిస్టమ్‌లను జీఎం ప్రారంభించారు. రైల్వే హాస్పిటల్, ట్రాక్షన్ పవర్ కంట్రోల్ భవనాలను కూడా సందర్శించారు. రైల్ వికాస్ భవన్‌లో గుంటూరు డివిజన్ పురోగతిపై సమీక్షించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణసేన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీఎంకు పురోగతిని వివరించారు. కార్యక్రమాల్లో ఏడీఆర్‌ఎం కే సైమన్, గతిశక్తి సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ జేవీ అనూష, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ సూర్యనారా యణ్, సీనియర్ డీఈఈ రవితేజ, డీఎస్‌సీ మధుసూ దనరావు పాల్గొన్నారు.

మరమ్మతులపై.. ఎస్కేప్

- షట్టర్లు శిథిలమైనా సాగునీరు వృథా
- ఏడాదిగా పట్టించుకోని ఇరిగేషన్ శాఖాధికారులు

మాచర్లటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడి కాల్వ పశువేములలోని సూరమ్మ చెరువు వద్ద ఎస్కేప్ ఛానల్ షట్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. గత సంవత్సరం వర్షాకాల సీజన్‌లో కుడి కాల్వకు నీటి విడుదల జరిగిన సమయంలో షట్టర్లు ధ్వంసమయ్యాయి. దీంతో పెద్ద బండరాళ్లను టిప్పర్ల ద్వారా తీసుకొచ్చి షట్టర్లకు అడ్డంగా పెట్టారు. ఏడాదిగా షట్టర్లకు మరమ్మతుల విషయంపై నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో వరద నీటిని కుడి కాల్వ ద్వారా దిగువ ఎత్తిపోతలకు విడుదల చేస్తారు. షట్టర్లు మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా ప్రవహిస్తూ సమీప పొలాలను ముంచెత్తుతోంది. వేసవి సమీపించినా అధికారులు మరమ్మతులపై దృష్టి సారించలేదు. మరో నెలలో కుడి కాల్వకు నీటి విడుదల జరిగే అవకాశం ఉంది. ఇప్పుడు మరమ్మతులు చేయకపోతే మరో ఏడాది రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. కాల్వ నీరు చివరి భూములకు చేరాలంటే నీటి వృథాను అరికట్టాలి. ఈ పరిస్థితుల్లో యుద్ధప్రాతిపాదికన షట్టర్లకు మరమ్మతులు చేసి పొలాల ముంపు సమస్యతో పాటు నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



కాలువలో షట్టర్లకు అడ్డంగా బండరాళ్లతో నింపిన దృశ్యం

సూర్యఘర్ లక్ష్యం.. లక్ష ఇళ్లు

- 25 కల్లా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి
- విద్యుత్‌శాఖకు కలెక్టర్ అరుణ్‌బాబు టార్గెట్

నరసరావుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్ష మంది వినియోగదారులకు ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని వర్తింప చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. పథకం అమలుపై శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యం ప్రకారం ఈ నెల 25 కల్లా రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. ఒక్కో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నియోజకవర్గంలో 10 వేల మంది వినియోగదారులు సూర్యఘర్ పథకంలో భాగమయ్యే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. 25 ఏళ్ల నిరంతరాయం గా ఉచిత విద్యుత్‌తోపాటు అదనపు విద్యుత్ విక్రయం ద్వారా ఆదాయం ఆర్జించవచ్చని వినియోగదారులకు అవగాహన కల్పిం చాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ, బీసీలకు రూ.98 వేలు, ఇతరులకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. తక్కువగా దరఖాస్తులు నమోదుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఈ, సిబ్బంది రోజుకు కనీసం పది దరఖాస్తులు నమోదు చేయాలని కలెక్టర్ లక్ష్యం నిర్దేశించారు. సోలార్ పానెల్స్ ఏర్పాటు, రుణ సదుపాయం తదితరాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించని వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చ రించారు. సమావేశంలో జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ డా.విజయ కుమార్, ఈఈ సి.హెచ్ రామ్‌బొట్లు, ఏడీఈలు సింగయ్య, వై.ఏడుకొండలు సీనియర్ గణాంక అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్, సిబ్బంది

తెనాలి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలై గంజాయి విక్రయాలు చేస్తున్న నలుగురు ముఠాను రూ రల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులు, పట్టుకున్న గంజాయితో కేసు వివరాలను సీఐ ఉమేష్ వెల్లడించారు. తెనాలి మండలం సోమసుందరపాలేనికి చెందిన అలికిపల్లి సాంబిరెడ్డి, ఆటోనగర్‌కు చెందిన కూరగంటి చైతన్య, పెదరావూరుకు చెందిన పగడం మణి సింహారెడ్డి, తెనాలి ఐతానగర్‌కు చెందిన సుకుమార్ స్నేహితులు. వ్యసనాలకు బానిసలైన నలుగురూ డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను ఎంచుకున్నారు. గుంటూరు కొత్తపేటకు చెందిన రత్తయ్య వద్ద నెలకోసారి గంజాయిని కొనుగోలు చేసి, తెనాలిలో చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి.. ప్యాకెట్ రూ. 500 వంతున విక్రయిస్తుంటారు. గురువారం రత్తయ్య వద్దకు నలుగురూ సాంబిరెడ్డి బైక్‌పై వెళ్లి కేజీ నాలుగు వందల గ్రాములు గంజాయిని రూ.12,000 కొనుగోలు చేశారు. సుకుమార్ గుంటూరులోనే ఆగిపోవడంతో మిగిలిన ముగ్గురూ గంజాయితో తెనాలికి బయలు దేరారు. నందివెలుగు కూడలిలో రూరల్ సీఐ ఉమేష్, ఎస్ఐలు ఆనంద్, శ్రీనివాసరావు సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులను పట్టుకుని వారి వద్ద ఉన్న గంజాయిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న సుకుమార్, గంజాయి విక్రయించిన రత్తయ్యను అదుపులోకి తీసుకోవాల్సి ఉందని సీఐ ఉమేష్ పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ వి.చంగలరాయుడు, కానిస్టేబుల్ రవి, కపూర్ నాయక్, ఇంకోల్లు రవికుమార్ పాల్గొన్నారు.

గుత్తేదారి కనపడలేదా!

● అధ్వానంగా రేపల్లె-నిజాంపట్నం రహదారి ● అభివృద్ధికి రూ.9 కోట్లతో టెండర్
● మూడు నెలల నుంచి పనుల నిలుపుదల ● పట్టించుకోని అధికారులు..వాహనదారుల అవస్థలు



శింగుపాలెం వద్ద రహదారి గుంతలో ఇక్కట్లు



నిజాంపట్నం గ్రామం వద్ద రహదారిలో నిలిచిన వర్షపు నీరు

రేపల్లె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధికి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.9 కోట్ల నిధులు మంజూరు చేశారు. రోడ్లు, భవనాలశాఖ అధికారులు టెండర్లు పిలవడంతో ఒంగోలుకు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. మూడు నెలలుగా రేపల్లె పట్టణం ఇసుకపల్లి నుంచి సజ్జావారిపాలెం వరకు రహదారిని తవ్వేసి బీటీ వేసి వదిలేశారు. దీంతో కంకరరాళ్లు బయటకు తేలి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో భారీగా దుమ్ము లేచి, వెనుకనుంచి వచ్చేవారికి రహదారి కనబడే పరిస్థితి లేకుండా ఉంది. సజ్జావారిపాలెం వద్ద సగం రహదారి తవ్వేసి వదిలేయడం, ఒక వైపు భారీ గుంతగా ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రహదారి అంతా భారీస్థాయిలో గుంతలు పడటంతో వర్షపు నీరు, గృహాల వ్యర్థపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. శింగుపాలెం, పల్లపట్ల, నిజాంపట్నం గ్రామాల్లో పదేసి మీటర్ల పైనే గుంతలు ఉన్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకున్నా ఆర్అండ్‌బీ అధికారులు అభివృద్ధిపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి రహదారి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని తీరప్రాంతవాసులు కోరుతున్నారు.

మా అప్పు కడితే చాలు.. పార్టీతో సంబంధం లేదు

● సాయి కార్తిక్ సిటీ సెంటర్ రుణదాతల డిమాండ్



మాట్లాడుతున్న సాయి కార్తిక్ సిటీ సెంటర్ రుణ దాతలు

చిలకలూరిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద తీసుకున్న రూ. 7.5 కోట్ల మొత్తాన్ని తక్షణం తిరిగి చెల్లించాలని శుక్రవారం బాధిత రుణ దాతలు శుక్రవారం సాయి కార్తిక్ సిటీ సెంటర్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పట్టణానికి చెందిన కొందరు మీడియా ప్రతినిధులను వెంటతీసుకుని వెళ్లి సిటీ సెంటర్ వద్ద నివాసముంటున్న సెంటర్ భాగస్తుడు రావి సుధాకర్‌ను కలిశారు. కొద్ది రోజుల క్రితం రావి సుధాకర్, భార్య, కుమారుడు రావి మురళి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ సాయి కార్తిక్ సిటీ సెంటర్ భవనాన్ని టీడీపీకి చెందిన వారు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తాము డబ్బు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ రుణ దాతలు వచ్చి తీసుకోవడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో రుణ దాతలు ఎవరికి ఎంత అప్పులు ఉన్నారో తెలిపే పత్రాలను సుధాకర్‌కు చూపించారు. అయితే.. ఈ బాకీలతో తనకు సంబంధం లేదని, తన కుమారుడు మురళీని అడగాలని సుధాకర్ సమాధానం ఇచ్చారు. అనంతరం బాధితులు కె.అంజిబాబు, తేలప్రోలు వీరయ్య చౌదరి, భీమినేని స్వాములు, సోమేపల్లి ప్రసాద్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ మీట్‌లో రావి సుధాకర్, మురళి తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. వారి భవనాన్ని తాము ఆక్రమించుకుంటే రావి సుధాకర్ అందులో ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. వారి ఆస్తులతో తమకు సంబంధం లేదని చెప్పారు. ఈ విషయంలో టీడీపీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ డబ్బు తమకు ఇస్తే సమస్య పరిష్కారమవుతుందని తేల్చి చెప్పారు.

22 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 22 నుండి మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగుతున్నట్లు ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్- టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.మధుబాబు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు గుంటూరు నగరపాలక సంస్థ ఇంచార్జి అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నగరపాలక, పురపాలక సంఘాల్లోని నాన్ పీహెచ్ విభాగంలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు జీతాలు పెంచాలని ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో 38 రోజులుగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలోని సీడీఎంఏ రెండుసార్లు చర్చలు జరిపి.. పురోగతి లేకుండానే ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రితో చర్చలు జరిపినా.. ఇదే సమాధానం వచ్చిందని వెల్లడించారు. కార్మిక సంఘాలన్నీ ఐక్య కార్యచరణ కమిటీగా ఏర్పడి ఈ నెల 9న వడ్డేశ్వరంలోని సీడీఎంఏ మురళీ కృష్ణకి సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. గుంటూరు నగరపాల సంస్థ కమిషనర్ అందుబాటులో లేకపోవడం వల్ల ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుకి సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటిబాబు, కార్యనిర్వహణ కార్యదర్శి గాలి ఏసుబాబు, కోశాధికారి నాగిపోగు సుమన్, కార్మికులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ మరమ్మతులు చేపట్టాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పెదకాకాని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమ కృష్ణా డెల్టాలో ఉన్న ప్రధాన, పంట కాల్వల మరమ్మతులు వెంటనే చేపట్టి ఖరీఫ్ సీజన్‌లో నీటి పారుదలకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెదకాకాని సమీపంలోని గుంటూరు చానల్‌ను రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశ్చిమ కృష్ణా డెల్టాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగు చేస్తారని తెలిపారు. డెల్టాలో పంటలు బాగా పండాలంటే నీటిపారుదల సక్రమంగా జరగాలని పేర్కొన్నారు. కావున యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం పూడికతీత, తూటికాడ, గుర్రపు డెక్కను తొలగించాలని సూచించారు. 800 మరమ్మతుల పనులకు పనులు ప్రతిపాదించి, రూ. 48.27 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేసినప్పటికీ ఇప్పటి వరకు నిధులు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపక పోవడం దురదృష్టకరమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

18న ధ్యానబుద్ధ వద్ద యోగాంధ్ర

● 2వేల మంది లక్ష్యంగా ఏర్పాట్లు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఉదయం 6 నుండి 8.30 గంటల వరకు ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద సుమారు రెండు వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి మండల స్థాయి అధికారులతో కలసి ధ్యానబుద్ధ ప్రాజెక్టు, బుద్ధవనం ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతికి ఐకాన్‌గా ఉన్న ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద యోగా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు.. అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా, డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామాల ప్రజలు, విద్యా సంస్థల నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో కొండవీటి కోట, నాగార్జునసాగర్, కోటప్పకొండ వద్ద కార్యక్రమాలు నిర్వహించామని, అమరావతిలో జరిగే కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రాజగోపాల్, తహసీల్దారు దానియేలు, ఎంపీడీఓ టి.పార్వతి, టూరిజం అధికారి జి.నాయుడమ్మ, ఈఓపీఆర్డీ కె పద్మజ, ఎంఈఓ శివబాబు, ఎస్ఐ అమీర్, సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తల్లికి వందనం.. ఆనందం

(5వ పేజీ తరువాయి)

బ్యాంకుల నుంచి ఎస్ఎంఎస్‌ల ద్వారా నగదు జమైన ట్లు సందేశాలు రావడంతో చాలామంది సాయంత్రానికే ఏటీఎంలకు క్యూ కట్టారు. 14న రెండో శనివారం, 15న ఆదివారం వరుస సెలవుదినాలు కావడంతో శుక్రవారమే నగదు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. పాఠశాలలు, కళాశాలలు తెరవడంతో పిల్లలకు అవసరమైన ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు వంటివి కొనుగోలు చేసుకోవడానికి తల్లికి వందనం నగదు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి సచివాలయాల వారీగా సోషల్ ఆడిట్ జరుగుతుందని అభ్యంతరాల స్వీకరణకు జూలై 5 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పథకం లబ్ధి అందేలా చూస్తామని అధికారులు తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులైన వారి జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఇప్పటికే నగదు జమైన తల్లులు ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే సచివాలయాలలో తెలపాలని ప్రభుత్వం సూచించింది. అర్హత ఉండి పథకం అందని వారు వివరాలను సచివాలయాల్లో ఇస్తే త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల విషయంలో తలెత్తిన సాంకేతిక చిక్కులను తొలగించుకోవడానికి పిల్లల తల్లులు దృష్టిపెట్టాలని అధికారులు కోరుతున్నారు. కొంతమంది తల్లుల ఖాతాల్లో నగదు జమ అయినా వారి బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడంతో రిఫండ్ వెళ్లిపోయాయని అధికారులు చెబుతున్నారు.

నాడు ఒకరికి.. నేడు అందరికీ

వైసీపీ హయాంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే రూ.13 వేల నగదు జమ అయ్యేది. అయితే దీని వల్ల మిగిలిన పిల్లల చదువుల కోసం పేదలు ఇబ్బందులు పడుతుండటాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తించారు. సూపర్‌సిక్స్ పేరుతో తీసుకువచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టోలో తల్లికి వందనం పథకాన్ని చంద్రబాబు చేర్చారు. పైగా కుటుంబంలో ఒకరికి కాదు.. ఎందరు పిల్లలు ఉన్నా వారి చదువులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సహా కూటమి నేతలు ప్రకటించారు. తనకున్న బిడ్డలందరి చదువుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నగదు జమ అనడంతో గంపగుత్తగా మహిళలు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీలతో గెలిపించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ నగదు జమ చేయడంతో పేద కుటుంబాల్లో సంతోషాలు రెట్టింపయ్యాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 512.90 అడుగులు ఉంది. ఇది 136.64 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

'సంగం' వరి విత్తనాలు సిద్ధం

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరి విత్తన పరిశోధన విభాగం ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పర్యవేక్షణలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కొన్నేళ్లుగా సంగం సీడ్ ప్రాజెక్టు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. విత్తన పరిశోధన అభివృద్ధి విభాగం రూపొందించిన మేలైన రకాలు ఎస్ఎస్ఆర్-2 పది కేజీల విత్తనాల సంచి రూ.750 , ఎస్ఎస్ఆర్-4 పది కేజీల సంచి రూ.750, బీపీటీ 5204 సర్టిఫైడ్ వరి విత్తనాలు 20 కిలోల సంచి రూ.940, ఫౌండేషన్ విత్తనాలు 20 కిలోలు రూ.1,020కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు 93984 23590 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వృద్ధుల సంరక్షణ వారసుల బాధ్యత

● న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వారి సంరక్షణ బాధ్యత వారసులు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ సయ్యద్ జియావుద్దీన్ పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ, అవగాహన దినోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. వారసులకు ఇచ్చే ఆస్తుల గిఫ్ట్ డీడ్‌ను తమను సక్రమంగా చూడకపోతే రద్దవుతుందనే అంశాన్ని అందులో పొందుపరచాలని, దీంతో సత్ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం ద్వారా బాధిత వృద్ధులు.. న్యాయం పొందవచ్చని చెప్పారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మానసిక వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు,సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, న్యాయవాది కాళిదాసు, మానవత నేతలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని పలువురి మృతి

వినుకొండటౌన్, జూన్ 13,(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నూజెండ్ల మండలం పెద్దావరం గ్రామానికి చెందిన బండి నారాయణ (29) కుటుంబ సభ్యులతో కలిసి ప్రకాశం జిల్లా మేడపీ వెళ్లి ద్విచక్ర వాహనం తిరిగి స్వగ్రామం వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే నారాయణ మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య సైలు, 8 నెలల కుమార్తె ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మాచర్ల పట్టణంలో..

మాచర్లటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని వివేకానంద ఆశ్రమం సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ సక్రునాయక్ (55) గురువారం రాత్రి ఆశ్రమ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. వెల్దుర్తి మండలం శ్రీరాంపురం తండా నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న మేరాజ్యోత్ శివమణినాయక్, పోకూరు వేణు అతనిని ఢీకొన్నారు. సక్రునాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వట్టిచెరుకూరులో...

వట్టిచెరుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చమళ్లమూడి, కాట్రపాడు గ్రామాల మధ్య గురువారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మండలంలోని సౌపాడు ఎస్సీ కాలనీకి చెందిన కాంబ్రు కిరణ్ తేజ(22) ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ రమా నాయక్ వెల్లడించారు. కాంబ్రు కిరణ్ గురువారం రాత్రి గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. కాట్రపాడు వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమా నాయక్ తెలిపారు.

ఏఎన్‌యూ పీజీ మూడోవ సెమిస్టర్.. ఫలితాల విడుదల

●20 వరకు పునఃమూల్యాంకన దరఖాస్తుకు అవకాశం

పెదకాకాని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ మూడవ సెమిస్టర్ పలు కోర్సుల పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఏఎన్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాదరావు ఫలితాలను వెల్లడించారు. సీఈ ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఎంఏ మ్యూజిక్, ఇంగ్లీష్, ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్), ఎంఎస్‌సీ ఎలక్ట్రానిక్స్, ఫోరెన్సిక్ సైన్సెస్, హార్టికల్చర్, ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సుల ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు. పునః మూల్యాంకనం కోసం ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఫలితాల పూర్తి వివరాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చమట శివయ్య(52) అనే కౌలు రైతు అప్పుల భారంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసినట్లు సీఐ రమా నాయక్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చెందిన చమట శివయ్య నాలుగేళ్లుగా ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశారు. సరైన దిగుబడి, ధర లభించక సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు కావడంతో.. గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. గురువారం అర్ధరాత్రి శివయ్య పురుగు మందు తాగి, వాంతులు చేసుకుంటుండగా.. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రమా నాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

38,365 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,095 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,365 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 3,866 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13000	334	9500	13500
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	-----
4884	---	---	341	10000	14000
సూపర్ 10	---	---	సూపర్ 10	--	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14600
షార్క్-1	------	------	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దాచేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సేవలకు అంతరాయం కలుగుతున్నట్లు దాచేపల్లి ఏఈ భగవాన్ శుక్రవారం తెలిపారు. శాఖాపరమైన లోపాలను సవరించేందుకు విద్యుత్ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

● రాజుపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి కోట పెదమస్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని సబ్‌స్టేషన్లలో 11కెవి లైన్లు మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● నకరికల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శనివారం అన్ని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ ఎస్‌కే గౌస్ తెలిపారు.

● అచ్చంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట, మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 14, 15 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు కొత్త లైన్‌ల మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శివకోటిరెడ్డి శుక్రవారం తెలిపారు.

● బెల్లంకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ పేర్కొన్నారు. 33కేవీ, 11కేవీ, లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

● మాచర్లటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ, మండల పరిధిలో శనివారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ రామయ్య తెలిపారు. మండలంలోని కొప్పునూరు, అనుపు, ఎన్‌ఎస్ డ్యాం, రాయవరం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. అలాగే పట్టణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

● కారంపూడి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారంపూడి, గాదెవారిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు ఏఈ జి.వీరాంజనేయులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

మాచర్లటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలంటూ జాతీయ స్థాయిలో పలు కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నేత అంజనేయులునాయక్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మాచర్ల మండల కమిటీ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు.

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డీఎంహెచ్‌వో రవి



నెమలిపురిలో మురుగు కాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి తదితరులు

రాజుపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి తెలిపారు. శుక్రవారం మండలంలోని నెమలిపురి గ్రామంలో ఫ్రైడే డ్రైడే పరిశీలించటానికి వచ్చిన ఆయన గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా పడుతున్న కారణంగా నీటి నిల్వలలో దోమలు పెరిగి ప్రజలు డెంగీ, మలేరియా వ్యాధిబారిన పడే అవకాశం ఉన్నదని, అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకుని మందులు వాడుకోవాలన్నారు. తొలుత ఏర్పాటు చేసిన సభలో డీఎంహెచ్‌వో రవి మాట్లాడుతూ యుక్త వయస్సులో గర్భం దాలిస్తే అనర్థాల గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి పద్మావతి, స్థానిక వైద్యాధికారి రవితేజనాయక్, సత్తెనపల్లి సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీదుర్గ, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పేదలకు ఉచిత వైద్యం లక్ష్యంగా మెడికల్ క్యాంప్‌లు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తైన సందర్భంగా స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో కాటూరి మెడికల్ కాలేజి సహకారంతో ఉచిత వైద్యశిబిరంను ఎమ్మెల్యే ఏర్పాటుచేయించారు. వైద్య, రక్తదాన శిబిరాన్ని ప్రవీణ్ ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కళాశాల కోఆర్డినేటర్ రామకృష్ణ, 60మంది వైద్యులు పాల్గొని 350 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దళితులపై జగన్‌ది కపట ప్రేమ

● టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల విమర్శ

క్రోసూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి దళితులపై కపట ప్రేమ చూపుతున్నాడని, ఈ మధ్య కాలంలో దళితులను తానేదో ఉద్ధరించినట్లు మాట్లాడుతున్నాడని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దుద్దుల యోహాన్ విమర్శించారు. శుక్రవారం ఆయన క్రోసూరులో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరుగుతున్నట్లు జగన్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. జగన్ పాలనలో దళిత యువకుడు సుబ్రహ్మణ్యాన్ని హత్య డోర్‌డెలివరీ చేసిన అనంతబాబును పక్కన కూర్చోబెట్టుకొని తిరగటం దళితులపై జగన్ కపట ప్రేమకు నిదర్శనమన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించారన్నారు. పథకాలకు అంబేద్కర్ పేరు తీసివేసి తన పేరు పెట్టుకున్నారన్నారు. దళిత డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై బట్టలు ఊడదీసి కొట్టడం, గడ్డం శ్రీను నోట్లో పురుగుల మందు పోసి చంపటం వంటి సంఘటనలు దళితులకు ఇంకా గుర్తు ఉన్నాయన్నారు. జగన్‌కు దళితులంటే ఈర్ష్య, అసూయ మాత్రమే ఉన్నాయన్నారు. ఆయనతో పాటు చిలకా రాంబాబు, చిలకా ఆదెయ్య, గుడేటి ప్రకాశం, మరియదాసు, ముక్కంటి, చంద్రశేఖర్, మురళీకృష్ణ, నల్లపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు అభివృద్ధికి అత్యధిక నిధులు

క్రోసూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం పల్నాడు జిల్లా అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించిందని పలువురు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. నగర జీవనోపాధి మిషన్ ద్వారా 4,275 స్వయం సహాయక సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. 2,249 మరుగుదొడ్లు, 10,443 గృహాలు, 68శాతం మందికి ముద్రరుణాలు మంజూరు చేసిందన్నారు. విలేకరులతో బీజేపీ మండల అధ్యక్షుడు డీ వెంకట శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్, రవీందర్, బాబూరావు, రాజశేఖర్, మస్తాన్‌రావు తదితరులు మాట్లాడారు.

హస్నాబాద్‌తండాలో కార్డెన్‌సెర్చ్

మాచర్ల రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్‌తండాలో శుక్రవార నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, ఎక్సైజ్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యాన కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 14మందిని మాచర్లలో తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎవరైనా నాటుసారా విక్రయిస్తున్నట్లు తెలిస్తే సెల్ 9440902487కు సమాచారం అందించాలని ఎక్సైజ్ సీఐ కోరారు.



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న అధికారులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బెల్లంకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ క్రాస్‌రోడ్డు వద్ద ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి అపరాధరుసుం వసూలు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ షణ్ముక్, సిబ్బంది ఎల్ వెంకటేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవనంలో యోగా భాగం కావాలి

● ఎస్పీఎఫ్ కమాండెంట్ శంకర్



యోగాలో పాల్గొన్న ఎస్పీఎఫ్ సిబ్బంది

రెంటచింతల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని ఎస్పీఎఫ్(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) కమాండెంట్ ఎం.శంకర్ కోరారు.యోగాంధ్రా 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో సిబ్బందితో కలిసి యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణ, డీఎస్పీ టీకే చారి, ఎస్‌ఐ గురుమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

18న ఎస్‌బీఐ ఆవరణలో బ్లడ్ డొనేషన్ క్యాంపు

మాచర్లటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో ఈనెల 18వ తేదీన బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై 1వ తేదీ నాటికి ఏర్పడి 70 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంలో 70 వేల యూనిట్స్ బ్లడ్ సేకరించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు, వ్యాపారులు, రక్తదానం పట్ల ఆసక్తి ఉన్నవారు బ్లడ్ డొనేషన్‌లో పాల్గొని రక్తం ఇచ్చి క్యాంపును విజయవంతం చేయాలని కోరారు. ఎస్‌బీఐ అధికారులు అశోక్‌కుమార్, పున్నారావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే విద్యార్థులకు మేలు

● టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు చౌదరి

మాచర్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే విద్యార్థులకు మేలు చేకూరుతుందని టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి అన్నారు. శుక్రవారం విజయపురిసౌత్ ప్రభుత్వోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన పాఠ్యపుస్తకాలు అందించి మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, పాఠశాల కమిటీ చైర్మన్ రామ్‌చంద్‌నాయక్, టీడీపీ నేతలు ఆడెపు కోటయ్య, సీహెచ్ అప్పలరాజు, కట్టా రాజు, మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

కారంపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 15వ తేదీన మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కారంపూడిలో వారు మాట్లాడుతూ గుంటూరు ఆర్కా హాస్పిటల్, పిడుగురాళ్ల ఉన్నం హాస్పిటల్ సౌజన్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించనున్నట్లు చెప్పారు. కారంపూడి, దుర్గి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉన్నం లక్ష్మీనారాయణ, గాడిపర్తి పూర్ణయ్య, పంగులూరి అంజయ్య, గంగవరపు పుష్పలత శివరాం, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కోదాడ ప్రభాకర్, మాదల శ్రీహరి, ఉన్నం హరిబాబు, బొల్నేడి హరికృష్ణ పాల్గొన్నారు.

రేపు జాతీయ బీసీ సంక్షేమ సంఘ సమీక్ష

గురజాలటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న పల్నాడు కన్వెన్షన్ హాలులో ఈనెల 15వ తేదీన జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమీక్ష నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సిద్ధారపు గాంధీ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి మాచర్ల, గురజాల నియోజకవర్గ పరిధిలోని బీసీ, మైనార్టీ నాయకులు పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించండి

అచ్చంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో శుక్రవారం రాత్రి సీపీఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గసభ్యుడు బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి విస్మరించిందని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అచ్చంపేట మండల నూతన కార్యదర్శిగా షేక్ ఖాదర్ మస్తాన్, కమిటీ సభ్యులుగా షేక్ మహమ్మద్ రియాజ్, సంపంగుల ఏడుకొండలు, బీ శ్రీనివాసరావు, తాళ్ళూరి మోహనరావు, అచ్చంపేట పట్టణ కార్యదర్శిగా మధు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

పెదకూరపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేద కుటుంబాలకు వరమని సత్తెనపల్లి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు పెనుముచ్చు రామారావు అన్నారు. మండలంలోని గారపాడు గ్రామంలో నెల్లూరి కవిత మృతి చెందటంతో రూ 1,16,500 చెక్కును శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మక్కెన సాగర్, పొదిలి కోటేశ్వరరావు, పెనుముచ్చు రమేష్, మేడా బాబు పాల్గొన్నారు.

హామీని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

బెల్లంకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి బెల్లంకొండ మండలంలోని యాజమ్మాజీగూడెంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి రామకృష్ణ, ఇక్కుర్తి పేరయ్య, చిన వెంకయ్య, అనీల్ కుమార్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ అన్నారు. పెదకూరపాడులో శుక్రవారం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో షేక్ హసీనా, ఆయేషా, జహీద, సల్మ, షాజీద, బషీరూర్, ఆసిఫా, అర్తిమళ్ళ సుజాత, రజిని, వడ్లమూడి లక్ష్మి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

5400 మిరప టిక్కీలు అమ్మకం

దాచేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్‌కు 5900 మిరప టిక్కీలు చేరుకోగా 5,400 టిక్కీల అమ్మకాలు జరిగాయి. 334 రకం రూ 8వేలు - రూ 12,500, తేజా రకం రూ 9వేలు నుంచి రూ 14వేలు, తాలుకాయలు రూ 2వేలు నుంచి రూ 7వేలు వరకు ధరలు పలికాయి.

బీసీ సంక్షేమ హాస్టళ్లకు వార్డెన్ల నియామకం

రెంటచింతల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని బీసీ బాలుర హాస్టల్‌కు యు.జ్యోతిర్మయి, బాలికల వసతిగృహానికి కొచ్చెర్ల సుశీలను వార్డెన్లుగా నియమిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ సంక్షేమాధికారి మయూరి ఉత్తర్వులిచ్చారు.

ఈకేవైసీ చేయించుకోండి

దాచేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేయించు కోవాలని ఏవో కంచర్ల వెంకటేష్ శుక్రవారం తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని కోరారు.

● మాచవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. మాచవరం మండలంలో 8,578మంది రైతులను అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా ఈకేవైసీ చేయించు కోవాలని సూచించారు.

హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం

సత్తెనపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూపర్-6 పథకాల్లో ఒకటైన తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లుల ఖాతాల్లో నగదును ప్రభుత్వం జమ చేసి హామీలను నిలబెట్టుకుంటోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం పేర్కొన్నారు. కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసిందన్నారు.

మంత్రి ఆనంను కలసిన కన్నా



మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కలిశారు. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కన్నా లక్ష్మీనారాయణ మంత్రి ఆనంతో చర్చించారు.

ఉద్యోగాలకు 56 మంది ఎంపిక

సత్తెనపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు ప్రభుత్వం జాబ్‌మేళాలు నిర్వహిస్తుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాకు పది కంపెనీలు హాజరు కాగా 170మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అందులో 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కే పద్మ, పల్నాడు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రవీంద్ర నాయక్, సత్తెనపల్లి స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఇందూరి రామకృష్ణారెడ్డి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

















క్రెడిట్ పొందారు..!

సూపర్ సిక్స్‌లో..తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేసింది. హామీ ప్రకారం ఎంతమంది పిల్లలు బడికెళ్తే.. అంతమందికీ.. రూ.13 వేలు లెక్కన వారి తల్లుల ఖాతాల్లో జమ చేసి.. మాట నిలబెట్టుకున్న క్రెడిట్ పొందింది. బడి గంట మోగిన వెంటనే పిల్లల ఖర్చులెలా అని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు.. తమ ఖాతాలో పథకం డబ్బులు క్రెడిట్ కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు పిల్లల వారి ఆనందానికి ఇక హద్దులు లేవు. కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ఒకే కుటుంబంలో నలుగురికి, మరో కుటుంబంలో ముగ్గురికి


సలోమాను, ఫాతిమా కుటుంబం


గల్లా పిచ్చహరి, మల్లేశ్వరి కుటుంబం

మాచవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు విడుదల చేసిన తల్లికి వందనం జాబితాలతో ఆయా గ్రామాల్లో ఆనందోత్సాహాలు వ్యక్త మవుతున్నాయి. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం మంజూరు చేయడంతో తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు. మాచవరం మండలంలోని వేమవరం గ్రామానికి గల్లా సలోమాను, గల్లా పాతిమా అనే దంపతులకు ఐదుగురు సంతానం. వీరిలో నలుగురు జాబితాలో రాగా మరొకరు 10వ తరగతి అయి పోవడంతో ఈ నెల 30న మరో జాబితాలో అమ్మాయి రానున్నది. దీనిని బట్టి కుటుంబంలో ఉన్న ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం వర్తిస్తుంది. అదే విధంగా అదే గ్రామానికి చెందిన గల్లా పిచ్చహరి, గల్లా మల్లేశ్వరి దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురు పేర్లు జాబితాలో వచ్చాయి. మరొక అమ్మాయి 10వ తరగతి పాసవ్వటంతో ఈ నెల 30వ తేదీన విడుదల కానున్న మరో జాబితాలో రానున్నది. దీనిని బట్టి వారి కుటుంబంలో కూడా నలుగురికి తల్లికి వందనం వర్తిస్తుంది. ఇలా అనేక మంది కుటుంబాల వారికి ముగ్గురు నుంచి నలుగురు పిల్లలకు తల్లికి వందనం వర్తించే విధంగా అవకాశాలు మెండుగా ఉన్నాయి. మొత్తం మీద తల్లికి వందనం జాబితాలు రిలీజ్ చేయటంతో ఆయా గ్రామ సచివాలయాల్లో సందడి నెలకుంది.

ఇచ్చిన హామీ పక్కాగా అమలు



తుళ్లూరు, జూన్ ,(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడిచ్చిన తల్లికి వందనం పక్కాగా అమలు చేసింది. ఇంటిలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఒకటవ తరగతి నుంచి పన్నెండవ తరగత వరకు విద్యార్థులుంటే అంత మందికి సంవత్సరానికి రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో శుక్రవారం నుండి జమ కావడం ప్రారంభమైంది. మండల పరిధిలోని ఐనవోలు గ్రామానికి చెందిన ఒకే ఇంటిలోని పోతు రాజు ప్రవీణ్ , శివసేండ్, లాస్యకు తల్లికి వందనం పథకం కింద ఖాతాలో డబ్బులు జమ అయినట్లు కూటమి నాయకులు తెలిపారు. పథకం పార దర్శకంగా అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమాలకు కూటమి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. పేదల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షుడు యర్రగోపు నాగరాజు , బీజేపీ అధ్య క్షుడు నీరుకొండ లక్ష్మీ నారాయణలు పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా వలంటీర్ కుటుంబానికి నగదు జమ


ముగ్గురు పిల్లలతో కూనల రామయ్య


ముగ్గురు పిల్లలతో తల్లిదండ్రులు గంగారం సుభాని, గౌసియా

ముప్పాళ్ళ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో బాగంగా తల్లికి వందనం నగదును విద్యార్థుల తల్లి దండ్రుల ఖాతాలో శుక్రవారం జమ చేసింది. ఒకే ఇంటిలో ముగ్గురు విద్యార్థులు చదువుతున్నా వారందరికీ తల్లికి వందనం పథకంలో బాగంగా డబ్బులను తల్లుల ఖాతాల్లో నగదు వేశారు. పార్టీలకు అతీతంగా వలంటీర్ కుటుంబ సభ్యులకు నగదు వారి ఖాతాలో జమ అయ్యింది. దీంతో గ్రామాలలో తల్లుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గతంలో ఇంటిలో ఎంతమంది చదువుతున్నా ఒక్కరికి మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. రుద్రవరం ఎస్సీ కాలనీకి చెందిన కూనల రామయ్య, సుజాత లకు ముగ్గురు సంతానం కాగా గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పెద్దకూతురు సంజన 5వత`రగతి, రెండవ అమ్మాయి మోక్ష 3వ తరగతి, కొడుకు రక్షణ్ తేజ్ 1వతరగతి గతేడాది చదివారు. ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం రావడంతో తండ్రి రామయ్య ఆనందం వ్యక్తం చేశారు. ముప్పాళ్ళకు చెందిన షేక్ గంగారం సుభాని, గౌసియా దంపతులకు ముగ్గురు పిల్లలు పెద్దకుమార్తె ముప్పాళ్ల హైస్కూల్‌లో ఆసియా 10వ తరగతి, కుమారడు ఆసిఫ్, నరసరావు పేటలోని ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి, మరో కుమారుడు అర్షద్ ముప్పాళ్ళలోని ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం నగదు ఖాతాలో జయ అయ్యింది. మండలంలోని నార్నెపాడులో నాయుడు శ్రీను, నాగాంజలిల ముగ్గురు పిల్లల వెంకటేష్ 7వ తరగతి, షన్ముఖ సాయి 5వ తరగతి, రమ్యశ్రీ 2వ తరగతి గ్రామంలోని ప్రైవేటు పాఠశాల జీఎంఆర్ మెమోరియల్‌లో చదువుతున్నారు. వారికి కూడా తల్లికి వందనం పథకం వర్తించి ఖాతాలో నగదు పడింది. గ్రామాల్లో పాఠశాలలు పునఃప్రారంభం రోజునే.. తల్లికి వందనం జమకావడంతో తమ పిల్లలను సంతోషంగా ఏ కష్టం లేకుండా చదివించుకుంటామని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


షేక్ బుజ్జి, భర్త సుభానీతో ముగ్గురు పిల్లలు

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

పెదకూరపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతక మందికి కూటమి ప్రభుత్వం శుక్రవారం నగదును జమ చేసింది. పెదకూరపాడుకు చెందిన షేక్ బుజ్జి భర్త సుభానీలు, తమ ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పథకం నగదు రావడం తమకెంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. షేక్ ఆసీఫా తనకు ఉన్న ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ అయిందని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే ప్రవీణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనాల విఫణిలో.. జిల్లాకు నకిలీ మరకలు

- భద్రాద్రి కొత్తగూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు పట్టివేత
- మహబూబ్ నగర్‌లో దొరికిన బీటీ3 పత్తి విత్తనాలు
- రెండు తెలుగు రాష్ట్రాలకు గుంటూరు నుంచే సరఫరా
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థ

గుంటూరు సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరులో తయారువుతున్న నకిలీ విత్తనాలు రెండు తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్నాయి. మొన్న తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో నకిలీ పత్తి విత్తనాలు దొరికితే.. నేడు భద్రాద్రి కొత్త గూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు దొరికాయి. ఈ విత్తనాలు గుంటూరు విత్తనాల షాపులోనే విక్రయించినట్లు అక్కడి పోలీసులు తేల్చారు. గుంటూరు నగర పరిసర ప్రాంతాల్లోనే నకిలీ విత్తనాల మాఫియా పెద్ద ఎత్తున నిల్వలు తయారు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం దృష్టి సారించాల్సిన అంశం. ఎక్కడెక్కడి నుంచో విత్తనాలు తీసుకువచ్చి ఇక్కడ కొత్తగా ప్యాక్ చేసి.. మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు.

రాణీ బెంగళూరు నుంచి తెచ్చి

కర్ణాటకలోని రాణీ బెంగళూరులో ఎక్కువగా మిర్చి విత్తనాల ప్రాసెసింగ్ జరుగుతుంది. అక్కడ ప్రముఖ కంపెనీలు ఫెయిల్ అయిన విత్తనాలను లూజ్‌లో విక్రయిస్తాయి. కేజీ కేవలం రూ. 6 వేల నుంచి రూ. 10 వేల వరకు విక్రయిస్తారు. వాటిని ఇక్కడకు తెస్తున్న కొందరు వ్యాపారులు వేరే బ్రాండ్‌ల పేరుతో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. మంచి కంపెనీ విత్తనాల ధర కేజీ రూ.లక్ష పైగానే ఉంటుంది. ఫెయిల్ అయిన విత్తనాలను తీసుకువచ్చి చక్కగా ప్యాక్ చేసి కేజీ కేవలం రూ.40 వేల నుంచి రూ. 60 వేలకు విక్రయిస్తారు. షాప్‌లో దొరికే విత్తనాల ధరకు, బయట విత్తనాల ధరకు బాగా వ్యత్యాసం ఉండటంతో కొందరు రైతులు ఆ వైపుగా మొగ్గు చూపుతున్నారు. అవి సరిగా మొలవక, మొలిచినా కాపు, దిగుబడి రాక అల్లాడిపోతుంటారు. పత్తి విత్తనాలు కూడా గుజరాత్ ప్రాంతం నుంచి లూజ్‌లోనే ఎక్కువగా తెచ్చి అమ్ముతున్నారు. తెలంగాణలో సీజన్ ముందే ఆరంభం అవుతుంది.. కాబట్టి మొదట అక్కడి మార్కెట్‌పై దృష్టి సారిస్తారు. ఆ తర్వాత ఆంధ్రలో విక్రయాలు జరుపుతున్నారు.



భద్రాద్రి కొత్త గూడెం లో దొరికిన నకిలీ మిర్చి విత్తనాల ప్యాకెట్ లు

ప్రముఖ కంపెనీల్లో పనిచేసి..

ప్రస్తుతం గుంటూరు కేంద్రంగా నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్న వారంతా ఒకప్పుడు ప్రముఖ కంపెనీ లలో పనిచేసిన వారే. అక్కడ ఉన్న అనుభవంతో సొంతగా వ్యాపారం ఆరంభించి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈ రకమైన వ్యాపారం చేసే వారికి వ్యవసాయశాఖ, ఇతర నిఘా విభాగంలో పనిచేసే అధికారులతో మంచి సంబంధాలు ఉంటాయి. ఉదాహరణకు గుంటూరు వ్యవసాయ శాఖలో కీలకంగా పనిచేస్తున్న ఒక ఏఓ స్నేహితుడు ఇటువంటి వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి మేనల్లుడు ప్రస్తుతం తెలంగాణ విత్తనాల వ్యవహారంలో దొరికినట్లు చెబుతున్నారు. ఇలా నకిలీ, అనుమతి లేని విత్తనాల వ్యాపారం చేసే వాళ్లకు.. ఎక్కడో చోట అభయ హస్తం దొరుకుతోంది.

ఇంకా నిద్రావస్థలోనే...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం అయినా వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు నిద్ర మేల్కొన్న దాఖలాలు కనిపించడం లేదు. నకిలీ విత్తనాలు ఇప్పటికే విస్తారంగా గ్రామాలకు వెళ్లినా ఎక్కడా కూడా నామ మాత్రపు తనిఖీలు లేవు. ఏడాదిలో అసలు తనిఖీలు జరిగిన సందర్భాలు లేవని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నగరంలోని 34 పార్శిల్ కేంద్రాలు ఉన్నా.. వాటిలో కూడా పెద్దగా సోదాలు జరగడం లేదు. నగర పరిధిలోని వ్యవసాయ నిఘా విభాగం పూర్తి గా నిద్రావస్థలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రిమోట్ లొకేషన్‌తో..

గుంటూరు రైల్వే డివిజన్‌కు నష్టం

- రిజర్వేషన్‌లో కోల్పోనున్న కొన్ని రైళ్ల బెర్తులు
- ఈక్యూ బెర్తుల కోసం ప్రత్యేక చార్ట్ అనవసరం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జనరల్ కోటా నుంచి గుంటూరు రైల్వే డివిజన్‌ని రిమోట్ లొకేషన్‌కు మారుస్తున్నందున రిజర్వుడ్ టిక్కెట్ల పరంగా ఆదాయాన్ని కోల్పోనుంది. ఇదే సమయంలో ఇక్కడి ప్రయాణికులకు ఆయా రైళ్లలో బుకింగ్ చేసుకోవడానికి బెర్తుల సంఖ్య తగ్గిపోతుంది. ఈ నష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఎమర్జన్సీ కోటా బెర్తులను విడుదల చేసేందుకు అదనపు సమయం వస్తుందన్న ఆలోచనతో రిమోట్ లొకేషన్ చార్టింగ్‌కు ఇక్కడి కమర్షియల్ విభాగం అధికారులు ఆమోదించడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే శాఖ తీసుకొన్న ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరుతున్నారు.

మీటర్ గేజ్‌గా ఉన్న సమయంలో అమరావతి ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుంచి హుబ్లీకి రాకపోకలు సాగించేది. బ్రాడ్‌గేజ్‌గా మారిన తర్వాత ఈ రైలుని విజయవాడ వరకు పొడిగించారు. గత ఏడాది ఈ రైలుని ఏకంగా నరసపూర్ వరకు తీసుకెళ్లారు. దీంతో అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం నరసపూర్ - హుబ్లీ మధ్యన రాకపోకలు సాగిస్తోంది. కాగా ఇప్పటి వరకు నరసపూర్ నుంచి డోన్ వరకు జనరల్ కోటా ఈ రైలుకు ఉండేది. దీని వల్ల స్లీపర్, ఏసీ త్రీటైర్, టూటైర్ బెర్తులు పుష్కలంగా అందుబాటులో ఉండేవి. అయితే ఎమర్జన్సీ కోటా బెర్తులను విజయవాడ డివిజన్‌తో కలిసి గుంటూరు డివిజన్ పంచుకోవాల్సి వచ్చేది. ఈ కారణంగా ఇక్కడికి వచ్చిన ఈక్యూ విజ్ఞప్తులను విజయవాడ డివిజన్‌కు పంపితే అక్కడి అధికారులు కన్‌ఫర్మ్ చేసేవారు. అయితే గుంటూరుని రిమోట్ లొకేషన్‌లో పెట్టాలని డివిజనల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కారణంగా గుంటూరు నుంచి డోన్ వరకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ క్లాస్ బెర్తులు కేవలం 12, ఏసీ త్రీ టైర్ బెర్తులు నాలుగు మాత్రమే ప్రయాణికులు బుకింగ్ చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఏసీ టూటైర్‌లో ఒక్క బెర్తు కూడా బుకింగ్‌కు కేటాయించలేదు. మరోవైపు విజయవాడ నుంచి పుష్కలంగా బెర్తులు అందుబాటులో ఉంటాయి. దీంతో ఇక్కడి ప్రయాణికులు కూడా విజయవాడ నుంచి బుకింగ్ చేసుకొని బోర్డింగ్ చేంజ్ పెట్టుకొంటున్నారు. ఈ కారణంగా ఆయా టిక్కెట్ల ఆదాయం అంతా విజయవాడకు వెళ్లిపోతుంది.

ఇదే విధంగా వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా రాకపోకలు సాగించే మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి కూడా బెర్తుల సంఖ్య తగ్గింది. ఈ రైలుకు స్లీపర్ 52, ఏసీ త్రీటైర్ 37, ఏసీ టూటైర్ 9, ఫస్టు ఏసీ రెండు మాత్రమే కేటాయించారు. ఇదే రైలుకు విజయవాడ డివిజన్‌కు స్లీపర్ క్లాస్ 138, ఏసీ త్రీటైర్ 233, ఏసీ టూటైర్ 41, ఫస్టు ఏసీ 14 బెర్తుల కోటా కలిగి ఉంది. వాస్తవంగా ఈ రైలు ఎక్కువ దూరం ప్రయాణం చేసేది గుంటూరు రైల్వే డివిజన్‌లోనే. అయినప్పటికీ విజయవాడ కంటే తక్కువ బెర్తులు కేటాయించడం వల్ల ఇక్కడ వెయిటింగ్ లిస్టు ప్రారంభం కాగానే ప్రయాణికులు విజయవాడ నుంచి బుకింగ్ చేసుకొంటుండటంతో ఆ ఆదాయాన్ని గుంటూరు కోల్పోవాల్సి వస్తోంది.

ఐకానిక్ టవర్ల నిర్మాణానికి..

పర్యావరణ అనుమతులకు సీఆర్డీఏ లేఖ

- ఎస్ఈఐఏఏకు నివేదిక పంపిన సీఆర్డీఏ
- 2018లో జారీ చేసిన టీఓఆర్‌తో సమగ్ర నివేదిక
- వైసీపీ కుట్రల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఐకానిక్ సెక్రటేరియట్ భవన సముదాయానికి పర్యావరణ అనుమతులు కోరుతూ ఏపీ సీఆర్డీఏ లేఖ రాసింది. స్టేట్ లెవెల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ)కి సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఈ మేరకు వివరాలు సమర్పించారు. ఐకానిక్ భవన సముదాయంలో నిర్మిస్తున్న పరిపాలనా భవనాలు, సీఎంఓ వివరాలన్నీ సంబంధిత అధికారులకు పంపారు. 2018లో జారీ చేసిన టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీఓఆర్)ను జత చేసి సమగ్ర నివేదికను అధికారులకు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో డయా గ్రిడ్ విధానంలో మొత్తం 5 టవర్లు నిర్మిస్తున్నారు. వీటిలో నాలుగు పరిపాలన భవనాలు కాగా, ఒకటి ముఖ్యమంత్రి కార్యాలయంగా ఉంటుంది. రాజధాని పునర్నిర్మాణ ప్రక్రియ మొదలైన నాటి నుంచి వైసీపీ నేతలు కొందరు అడ్డుకోవడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. రాజధాని నిర్మాణానికి రుణ సహాయం అందజేయడానికి ముందుకు వచ్చిన ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులకు లేఖలు రాయడం, రాజధాని ప్రాంతంలో పర్యటనకు వచ్చిన ప్రపంచ బ్యాంకు పరిశీలన బృందాన్ని తప్పుదోవ పట్టించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. అవేవీ ఫలించకపోవడంతో పర్యావరణ సమస్యలను లేవనెత్తి అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీఏ అప్ర మత్తమైంది. పర్యావరణ సమస్యలు ఇప్పుడు, భవిష్యత్తులో లేవనెత్తే అవకాశం లేకుండా సీఆర్డీఏ పటిష్ట చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ లేఖ రాసింది.

రాజధాని జీవవైవిధ్యంపై క్షేత్రస్థాయి మూల్యాంకన

- రెండోరోజు వర్క్‌షాపులో పాల్గొన్న వివిధ విభాగాల ప్రముఖులు
- పలు అంశాలపై చర్చలు


అమరావతిలో పర్యటన అనంతరం ప్రముఖుల గ్రూప్ ఫొటో



విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో 'జీవ వైవిధ్యం, పర్యావరణ అభివృద్ధి' అంశంపై నిపుణుల నేతృత్వంలో జరిగిన రెండోరోజు వర్క్‌షాపు ముగిసింది. శుక్రవారం ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం అనంతవరం హిల్స్, శాకమూరు పార్క్, ఏజీసీ ప్రాంతం, హైకోర్టు, సీడ్ యాక్సెస్ రోడ్, ఏడీసీఎల్, వాటర్‌బాడీ, వెంకటపాలెం నర్సరీ వంటి కీలకమైన పర్యావరణ ప్రాంతాలను సందర్శించింది. ఈ ప్రదేశాలు అమరావతి గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్‌లో అంతర్భాగాలుగా ఉన్నాయి. అనంతరం ఏడీసీఎల్ హార్టికల్చర్ బృందంతో కలిసి వివిధ జాతుల చెట్లు పెరగడానికి అనుకూలమైన స్థలం, డిజైన్ మెరుగుపరిచే విధానంపై కార్యాచరణ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి అమరావతిని ప్రకృతిలో ఎలా అనుసంధానం చేయాలో ఈ బృందాలు వివరించాయి. అనంతరం ఏపీ సీఆర్డీఏ భవనంలో జరిగిన సమావేశంలో ఢిల్లీకి చెందిన నీలా హౌస్ కన్స్ట్రక్టెడ్ వెట్ ల్యాండ్ సంస్థ సభ్యులు మొక్కలు, జలసంబంధమైన ప్రణాళికల గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో పర్యావరణాన్ని పునరుద్ధరించే మొక్కల జాతులు గురించి ప్రదర్శించారు. అనంతరం అమరావతి గ్రీన్‌ఎనర్జీ మౌలిక సదుపాయాలు, పార్కులు, అవెన్యూలు, బఫర్ ప్లాంటేషన్, నగర వ్యాప్తంగా నీలి, ఆకుపచ్చ పర్యావరణ నెట్‌వర్క్ అభివృద్ధి గురించి ప్రెజెంటేషన్ చేశారు. ముగింపు సెషన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ వర్గీకరణ శాస్త్రవేత్త, మాజీ వైస్ చాన్సలర్ సీఆర్ బాబు, శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రసాద్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎన్.చంద్రమోహన్ రెడ్డి, ఏడీసీఎల్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కలెక్టర్ డైరెక్టర్ ధర్మజ, సీనియర్ ప్లానర్ ప్రమాన్‌కుమార్, ఏపీసీఆర్‌డీఏ స్ట్రాటజీ డివిజన్ డైరెక్టర్ ఎస్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల భవిష్యత్తు ఇక సెట్

- ప్రభుత్వ జూ.కళాశాలల్లో ఈఏపీ సెట్, నీట్ శిక్షణ
- కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- సమయ ప్రణాళికపై ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు

సత్తెనపల్లి జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదని కూటమి ప్రభుత్వం కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈఏపీ సెట్, నీట్‌లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని మార్గదర్శకాలను రూపొందించింది. ఇందుకు అవసరం అయిన పుస్తకాలను ప్రభుత్వ కళాశాలలకు అందజేసింది. పల్నాడు జిల్లాలోని ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,700 మంది ఉన్నారు. మొదటి సంవత్సరంలో 2,500 మంది అడ్మిషన్లు పొందనున్నారని సమాచారం. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ జూనియర్, ఆదర్శ కళాశాలలు, కెజీబీవీలు, రెసిడెన్సియల్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లు 62 ఉన్నాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 5 నుండి 10 శాతం మంది మాత్రమే ఇంజనీరింగు, వైద్య సీట్లు పొందుతున్నారు. ఉన్నత విద్య చదవాలని పేద విద్యార్థులకు ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేకపోవడంతో వెనుకబడి పోతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రధాన సబ్జెక్టులుగా బోధిస్తున్నారు. ఇంజనీరింగు, మెడిసిన్ శిక్షణ తీసుకోవాలంటే ప్రవేటుగా రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గనుంది. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ పాఠ్యాంశాలతో పాటు ఈఏపీ సెట్, నీట్ తదితర పోటీ పరీక్షలు రాసేందుకు శిక్షణ ఇవ్వాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు మెటీరియల్ సిద్ధం చేసి ఆయా కళాశాలలకు ఇప్పటికే పంపడం జరిగింది. పాఠ్యాంశాల బోధనతోపాటు వీటికి సంబంధించిన సమయ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించినట్లు డీఐఈఓ కె.సుచరిత తెలిపారు.

అడవిని తలపిస్తున్న ఐటీఐ ప్రాంగణం

- చెరువులా పల్లపు ప్రాంతం
- మురుగుతో దుర్గంధం


ఐటీఐ స్థలంలో పెరిగిపోతున్న ముళ్ల చెట్లు


జాతీయ చిహ్నం చుట్టూ అపరిశుభ్ర వాతావరణం

తెనాలి అర్బన్, జూన్13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గడిగుంటపాలెంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ స్థలంలో ముళ్ల చెట్లు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. పల్లపు ప్రాంతంలో నీరు చేరి చెరువులా మారింది. జాతీయ చిహ్నం చుట్టూ అపరిశుభ్రత పెరిగిపోయింది. 20 ఎకరాల్లోని ఐటీఐలో.. ఐదు ఎకరాల భూమిని కేంద్రీయ విద్యాలయం కోసం ఇచ్చారు. మిగిలిన 15 ఎకరాల్లో కొంత మేర కళాశాల భవనాలు ఉండగా.. మిగిలిన ప్రాంతమంతా పిచ్చి చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో విష సర్పాల బెడద ఎక్కువైపోయింది. జగ్గడిగుంటపాలెం రోడ్డు వైపు ఉన్న స్థలం పల్లం కావడంతో వర్షపు నీరు చేరుతోంది. దీనికి తోడు పంచాయతీ కాల్వలు సరిగా నిర్వహించకపోవడంతో మురుగు నీరు ఇక్కడ చేరుతోంది. దీంతో దుర్గంధం, దోమల బెడద అధికమైందని స్థానికులు వాపోతున్నారు. ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ చిహ్నం చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయింది. ఐటీఐలో అటెండర్లు, వాచ్‌మెన్‌లు లేకపోవడంతో విద్యార్థులతోనే కొంత మేరకు శ్రమదానం చేయించి శిక్షణ కేంద్రం నిర్వహణ ప్రాంతం వరకు శుభ్రంగా ఉంచుతున్నారు. దాతలు, ప్రభుత్వం స్పందించి ఐటీఐ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, మొక్కలు నాటి నిర్వహణకు తగిన సిబ్బందిని కేటాయించాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రభుత్వంపై పథకం ప్రకారమే వైసీపీ దుష్ప్రచారం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపైన, ప్రభుత్వ పథకాల అమలుపైన పనిగట్టుకొని మరీ వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ వైసీపీ నేతలకు, ఆ పార్టీ పేటీఎం బృందానికి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయటం ఒక వ్యసనంలా మారిందని, వారు పద్ధతి మార్చుకోకుండా విషప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. పేటీఎం బృందాన్ని నడిపించేవారు జైళ్లకు వెళ్లడం ఖాయం అన్నారు. సుపరిపాలన ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుచేస్తుంటే ఓర్వలేని వైసీపీ పెయిడ్ ప్రచారకర్తలు డబ్బులు బ్యాంకుల్లో పడటం లేదని, కోతలు పెట్టారని, అర్హులకు అన్యాయం జరిగిందని ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. జగన్ చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల కోలుకోలేని విధంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడినపెడుతూనే, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా శ్రమిస్తున్నారని చెప్పారు.

నేడు నియోజకవర్గవ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారాన్ని పురస్కరించుకుని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు, లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కొట్టివేత కారణంగా కొద్ది ప్రాంతాలు మినహా చిలకలూరిపేట నియోజకవర్గవ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం, బుచ్చిపాపన్నపాలెం, సుబ్బయ్యపాలెం సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను నేడు నిలిపివేయనున్నట్టు ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ళ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు. మూడో ఫేజ్ కరెంటు శనివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 9 గంటల వరకు ఉంటుందన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నరసరావుపేట పట్టణం మొత్తం...

నరసరావుపేట లీగల్, జూన్ 13, (ఆంధ్రజ్యోతి), విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పట్టణ మొత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు నరసరావుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల విడుదల

నరసరావుపేట టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మే 19 నుంచి మే 24 వరకు జరిగిన దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్ మే-2025 అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఏపీ ఓపెన్ స్కూల్ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని డీఈవో ఎల్.చంద్రకళ శుక్రవారం తెలిపారు. విద్యార్థి పేరు, జిల్లా పేరు, వారి పుట్టిన తేదీ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. మన మిత్ర (వాట్స్ యాప్ గవర్నెన్స్) ద్వారా హాయ్ అని 9552300009 నెంబర్‌కు మెసేజ్ చేసి విద్యార్థుల పరీక్షల ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలలో పల్నాడు జిల్లా నుంచి పదో తరగతి 524 మంది హాజరు కాగా 425 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 81.11శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 9వ స్థానంలో ఉందన్నారు. ఇంటర్మీడియట్‌లో 841మంది హాజరు కాగా 680 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 80.86 శాతంతో రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉందన్నారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు ఏదైనా ఏపీఆన్‌లైన్ సెంటర్ ద్వారా ఒక్కొక సబ్జెక్టుకు రీకౌంటింగ్‌కు రూ.200లు, వెరిఫికేషన్‌కు రూ.1000లు చెల్లించాలని డీఈవో ఎల్ చంద్రకళ తెలిపారు.

విజయోత్సవ బైక్ ర్యాలీ రద్దు

వినుకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరిగిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాలతో పాటు వినుకొండలో జరగనున్న బైక్ ర్యాలీని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నాదెండ్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం ముఖ ద్వారం సెంటర్‌లో కారు ఢీకొని ఇద్దరు పాదచారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు ఒరిస్సాకు చెందిన అంకిత బోలా, ప్రమోద్ బెహరాలుగా గుర్తించారు. ఇద్దరు స్థానికంగా ఉన్న ధనలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్నారు. వీరిద్దరు రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి చిలకలూరిపేట వెళ్ళే కారు వీరిద్దరిని ఢీకొట్టింది. ఎస్ఐ పుల్లారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిలకలూరిపేట వైసీపీ కమిటీల నియామకం

చిలకలూరిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణం, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల వైసీపీ కమిటీల అధ్యక్ష పదవులకు శుక్రవారం నియామకాలు జరిగాయి. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఆయా శాఖలకు అధ్యక్షుడిగా చిలకలూరిపేట పట్టణానికి షేక్ దరియావలి, చిలకలూరిపేట మండలానికి డి.శంకరరావు, నాదెండ్ల మండలానికి ఎం.ఏడుకొండలు, యడ్లపాడు మండలానికి వి.నరసింహారావు నియమితులయ్యారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అధికారులు జవాబుదారీతనంగా ఉండాలి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, ప్రతి ఒక్కరు కూడా బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. స్థానిక చీఫ్‌విప్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఫోన్‌చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించటంలో వినుకొండ నియోజకవర్గాన్ని, పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాల్సిన అవసరం ఉందన్నారు. తమ వద్దకు వచ్చే అర్జీలను స్కాన్‌చేసి అధికారులకు కూడా పంపిస్తామన్నారు. ప్రజాదర్బార్ నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తామందరికీ ఆదర్శం అన్నారు. పంచాయతీ సర్పంచ్‌లు, వీఆర్వోలు, మండల స్థాయి అధికారులు కూడా ఇకపై ప్రజా సమస్యలు పరిష్కరించడంలో భాగం కావాలని సూచించారు. ఇలా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజల ఆరోగ్యం వారి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తోందని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. గడిచిన ఏడాదిగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ప్రతి పేదవాడికి అండగా నిలిచేలా సీఎం సహాయ నిధి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వినుకొండ నియోజకవర్గానికి చెందిన వడ్లమూడి హరికృష్ణ అనే వ్యక్తికి కాలేయం మార్పిడికి అవసరమైన సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు చెక్కును జీవీ ఆంజనేయులు శుక్రవారం అందచేశారు. వెల్లటూరు రోడ్డులోని నివాసం ఉంటున్న హరికృష్ణ ఇటీవల కాలంలో ఓ ప్రైవేట్ వైద్యశాలలో కాలేయ మార్పిడి చికిత్స చేయించుకుని, అనంతరం చికిత్సకు అయిన ఖర్చు వివరాలతో సీఎం సహానిధికి దరఖాస్తు చేయగా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దీనిపై హరికృష్ణ కుటుంబ సభ్యులు జీవీకి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



వడ్లమూడి హరికృష్ణకు రూ. 10 లక్షల చెక్కును అందజేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

సుపరిపాలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ప్రజావేదికలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గంలో సుపరిపాలనే లక్ష్యంగా పనిచేసున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమం, మెరుగైన పాలనే లక్ష్యంగా ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కార కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తుందన్నారు. ప్రజల వ్యక్తిగత, సామాజికపరమైన అపరిష్కృత సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజల నుంచి 68అర్జీలను స్వీకరించారు. రేషన్ కార్డులు, నూతన గృహాలు, ఇండ్ల స్థలాల మంజూరు కోసం ప్రజలు అర్జీలు అందించారు. నియోజవర్గ, మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను, నాయకులను ఆదేశించారు. శుక్రవారం బాలయ్య నగర్, 9, 5 వార్డులలో పర్యటించారు. నూతనంగా నిర్వహించబోయే అభివృద్ధి పనులను ప్రారంభించారు. బాలయ్య నగర్‌లో రూ.11.50లక్షలతో పూర్తయిన కల్వర్టు, మేజర్ కాలువలు పూడికతీసే పనులు, 31వ వార్డులో సింధూ స్కూల్ వద్ద రూ.33లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టు పనులు, రూ.40లక్షలతో సత్తెనపల్లి రోడ్డు స్టేడియం వద్ద పెద్దకాలువ, గుంటూరు రోడ్డు తదితర ప్రాంతాలలో ఉన్న కాలువల పూడిక తీత ఆధునికీకరణ పనులను పరిశీలించారు. స్టేడియం వద్ద అన్న క్యాంటీను పరిశీలించి ఆహార నాణ్యతపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

రూ.18.75 లక్షలతో తాగునీటి పైప్‌లైన్లు, కాల్వల నిర్మాణానికి భూమి పూజ

పట్టణంలో 9వ వార్డులో రూ.8.75 లక్షలతో సైడ్ డ్రెయిన్ల నిర్మాణం, 5వ వార్డు క్రిస్టియన్‌పేటలో రూ.10 లక్షలతో తాగునీటి పైపుల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు భూమిపూజ చేశారు. కార్యక్రమాలలో వాసిరెడ్డి రవి, మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ ఎం.జశ్వంతరావు డీఈ రఫీక్, షేక్ పీర్‌సాహెబ్, షేక్ మన్నాన్ షరీఫ్, కోవూరి బాబు, రెహమాన్, ఎస్‌కే ఖాసీమ్ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల సమస్యకు పరిష్కారం: ఎమ్మెల్యే

దశాబ్దాలుగా ఉన్న దుర్గంధభరితమైన డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం కలగనుందని, స్వచ్ఛ నరసరావుపేట దిశగా అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం గుంటూరు రోడ్డులోని డంపింగ్ యార్డులో కాలుష్యరహిత వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి పీ నారాయణ ఆధ్వర్యంలో ప్రతి మున్సిపాలిటీ స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారన్నారు. లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ఉన్న ఇక్కడ వ్యర్థాలను వేరుచేసి వర్మీకంపోస్టుగాను, మిగిలిన వ్యర్థాలను జిందాల్‌కు తరలించి విద్యుత్ ఉత్పత్తి కోసం తరలిస్తామన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఆదేశాల మేరకు డంపింగ్ యార్డు స్థలాలు ఖాళీ చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. విజయవాడ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ గుంటూరు బైపాస్ రోడ్‌లోని 9.5 ఎకరాల విస్తీర్ణంలో 1,09,916 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు దీర్ఘకాలికంగా పేరుకుపోయి ఉన్నాయన్నారు. ఈ వ్యర్థాల నిర్వహణ ద్వారా కాలుష్య రహిత వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, వాసిరెడ్డి రవి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నరసరావుపేట లీగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మార్గదర్శకత్వంలో శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ పల్నాడు జిల్లా చైర్మన్ డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలోస్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రవికుమార్ రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల నియామకం

వినుకొండ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు వినుకొండ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలకు నూతనంగా ప్రధాన ఉపాధ్యాయులను నియమించారు. నడిగడ్డ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎంగా ఎం.వీ రమణారావు, వినుకొండ బాలికల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలిగా విశైలజాకుమారి, వినుకొండ బాలుర పాఠశాలకు యశోద, నిర్మల పాఠశాలకు సిద్దార్థిని, లయోలా పాఠశాలకు రాంబాబు, పెద్దకంచర్ల శ్రీరాములు నాయక్, నాగులవరం- ఎస్‌కే కరిముల్లా, కొత్తపాలెం పి.మాలతీ లతలను నియమించారు.

నూజెండ్ల మండల సీపీఐ కార్యదర్శిగా పవన్ కుమార్

నూజెండ్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండల సీపీఐ కార్యదర్శిగా ఏ పవన్ కుమార్, సహాయక కార్యదర్శులుగా కాకర్ల కొండలు, కే ఆంజనేయులుతో కూడిన ఐదుగురు కమిటీని శుక్రవారం మండల కేంద్రం నూజెండ్లలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వర ప్రసాదు రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ గ్రామాల్లో విస్తృతంగా పార్టీ విధానాలను తెలియజేసి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి యా రాము, నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఆర్.వందనం, కే.మల్లికార్జునరావు, ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జల బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

అంకమ్మతల్లికి జలాభిషేకం

ఈపూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులో అంకమ్మ తల్లి కొలుపులలో భాగంగా శుక్రవారం గ్రామస్థులు అంకమ్మతల్లికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామస్థులు బిందెలతో నీరు తీసుకుని గ్రామంలో కనక తప్పెట్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేశారు.

సచివాలయాల్లో తల్లికి వందనం లబ్ధిదారుల జాబితా

రొంపిచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల్లో తల్లికి వందనం జాబితాలను అందుబాటులో శుక్రవారం ఉంచారు. ఆయా సచివాలయాలకు వెళ్ళి జాబితాలను లబ్ధిదారులు పరిశీలించుకున్నారు. మండలంలో ముగ్గురు పిల్లల కన్నా అధికంగా ఉన్న వారి జాబితాను ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ఆయా పాఠశాలలకు వెళ్ళి పరిశీలించారు. తల్లిదండ్రులు, విద్యార్థుల ఆధార్ కార్డుల వివరాలను నమోదు చేసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వ గుర్తింపుపొందిన పాఠశాలల్లో అనర్హుల జాబితాను ఆయా పాఠశాలలకు పంపారు.



పాఠశాలకు బీరువా అందజేస్తున్న సభ్యులు

పాఠశాలలకు రెండు బీరువాలు బహూకరణ


రొంపిచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రెండు బీరువాలను శుక్రవారం దాతలు బహూకరించారు. గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ రూ.25వేలు విలువ చేసే బీరువాలను ఎంఈవో బ్రహ్మేశ్వరరావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. కార్యక్రమంలో వై మల్లికార్జునరావు, మొగల్ శ్యామ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదుపు అలవాటుగా మారాలి: ఎంపీడీవో స్వరూపరాణి

నాదెండ్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి తన సంపాదనలో కనీసం 20 శాతం పొదుపు చేయటం అలవాటుగా మారాలని ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారులకు పొదుపుపై అవగాహన కల్పించేందుకు ఒక్కరోజు వర్క్ షాపును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పొదుపుతోనే సాధ్యమవుతుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలంటే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. బరోడా బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా పొందే రుణాన్ని చెల్లిస్తే మరలా మరింత రుణాన్ని పొందవచ్చన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ప్రతి ఖాతా దారుడు తన సిబిల్ స్కోర్‌ను పెంచుకోవాలన్నారు. సమావేశంలో గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ అధికారి విశ్వేశ్వరరావు, ఏపీఎం రమేష్, ఆర్‌వో వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, వెలుగు కమ్యూనిటీ సీసీలు ఆర్ సాంబశివరావు, బీ హేమలత, సుధ, శౌరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ దేవదాయశాఖ ఈవోగా సుధాకర్‌రెడ్డి

వినుకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వినుకొండ దేవదాయశాఖ ఈవోగా సుధాకర్‌రెడ్డిని ప్రభుత్వం నూతనంగా నియమించింది. శుక్రవారం సుధాకరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో మందమంచిపాడు ఈవోగా పనిచేస్తూ బదిలీపై వినుకొండకు వచ్చారు. వినుకొండలో ఈవోగా పనిచేసిన హనుమంతరావు కారంపూడికి బదిలీ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన సుధాకర్‌రెడ్డి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



ఈవోగా బాధ్యతలు చేపడుతున్న సుధాకర్‌రెడ్డి



మిల్లు సిబ్బందిని విచారిస్తున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ శివరామకృష్ణ, చికిత్సపొందుతూ మృతిచెందిన కార్మికుడు జగన్నాథ్ కులదీప్

కార్మికుడిపై తోటి కార్మికుడు కత్తితో దాడి

● తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ మృతి

యడ్లపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కార్మికుడిపై మరో కార్మికుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని తిమ్మాపురంలోని ఓ నూలుమిల్లులో జరిగిన ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన కార్మికుడు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన జగన్నాథ్ కులదీప్ (38) తిమ్మాపురం గ్రామ పరిధిలోని మంజునాథ స్పిన్నింగ్‌మిల్లులోని క్వార్టర్స్‌లో భార్య పిల్లలతో కలసి నివాసం ఉంటూ అక్కడే పనిచేస్తున్నాడు. కుల్దీప్ భార్య నెల రోజుల క్రిందట పిల్లలతో కలసి ఒడిస్సాలోని స్వగ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలో ఈ నెల 10 అదే మిల్లులో పనిచేస్తున్న తోటి కార్మికుడు మంగూలు లెంక అనే కార్మికుడు జగన్నాథ్ భార్య గురించి ఆరా తీశాడు. దీనితో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆవేశంతో మంగూలు క్వార్టర్స్‌లోని తన నివాసానికి వెళ్లి కత్తితో వచ్చి జగన్నాథ్‌ను పొత్తి కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన జగన్నాథ్‌ను 108 అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ జగన్నాథ్ శుక్రవారం మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రూరల్ సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఎస్ఐ శివరామకృష్ణతో కలసి ఘటన జరిగిన ప్రాంతాన్ని సీఐ పరిశీలించడంతోపాటు, సంఘటనపై యాజమాన్యాన్ని, కార్మికులను విచారించారు.

పోలీస్ స్టేషన్లకు నూతన ద్విచక్ర వాహనాలు

● అందజేసిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు కేటాయించిన నూతన ద్విచక్ర వాహనాలను అందజేశారు. పల్నాడు జిల్లాకు నూతనంగా 15 ద్విచక్ర వాహనాలను కేటాయించారు. వీటిలో 14 అపాచీ వాహనాలు, ఒక బుల్లెట్ ద్విచక్ర వాహనం ఉన్నాయి. వాహనాలను పోలీస్ ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్లకు కేటాయించారు. నరసరావుపేటకు ఒక బుల్లెట్ రెండు అపాచీ ద్విచక్ర వాహనాలు, చిలకలూరిపేటకు రెండు, వినుకొండకు రెండు, పిడుగురాళ్ళకు రెండు, సత్తెనపల్లికి రెండు, మాచర్లకు రెండు, గురజాలకు ఒకటి, దాచేపల్లికి ఒకటి, అపాచీ ద్విచక్ర వాహనాలు కేటాయించారు. ఈ వాహనాలను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆయా పోలీస్‌స్టేషన్ సిబ్బందికి అందజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

యడ్లపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్‌బాబు (15) తల్లి శివపార్వతితో కలసి గ్రామంలోని బీసీ కాలనీలో ఉంటున్నాడు. మైదవోలు వెళ్లే మార్గంలో తల్లి నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్‌లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం పిండి వేసేందుకు గ్రైండర్ ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లగా, స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత

చిలకలూరిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్ వారు శుక్రవారం పట్టణంలోని సుగాలీ కాలనీకి చెందిన కోటమ్మబాయి అనే దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందచేశారు. స్థానిక స్వాతి జ్యూయలర్స్ అధినేత కొత్తూరి సూర్య నారాయణ ఇందుకు ఆర్థిక సహకారం అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, క్లబ్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, తియ్యగూర రమాదేవి, డాక్టర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందించిన ఇన్నర్‌వీల్ క్లబ్ నిర్వాహకులు

రచయిత కుందా కన్నుమూత



కుందా భాస్కరరావు (ఫైల్ ఫొటో)

నరసరావుపేట కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన డైట్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు, రచయిత కుందా భాస్కరరావు శుక్రవారం కన్నుమూశారు. అధ్యాపకుడిగా, పాఠ్యపుస్తకాల రచయితగా ఆయన చిరపరిచితుడు. ఉమ్మడి గుంటూరు జిల్లా బోయపాలెంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. 1998లో ఉత్తమ పాఠ్యపుస్తక రచయితగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డును అందుకున్నారు. ఆయన రాసిన బంతిపువ్వు కథ విమర్శకుల ప్రశంసలు పొందింది. అనంతరం బంతిపువ్వు పేరిట కథా సంకలనం వెలువరించారు. అక్షర కోకిల కవితా సంపుటి, సువర్ణం కథా సంపుటి, మనసు వాకిళ్ల వ్యక్తిత్వ వికాస కథలు, నేటి భాస్కర శతకం ఆయన కలం నుంచి జాలువారాయి. ఆయన మృతికి ప్రముఖ కథా రచయిత గంధం యాజ్ఞవల్క్యశర్మ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాకాని సుధాకర్, నరసరావుపేట రంగస్థలి కార్యవర్గం, సాహితీ సంస్థలు సంతాపం తెలియజేశారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ చేయించాలి

● మండల ఇన్‌చార్జి ఏవో రామారావు

శావల్యాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హుల జాబితాలో పేర్లున్న రైతులంతా రైతుసేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామినేని రామారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల నుంచి మొత్తం 10236మంది రైతుల వివరాలను వీఏఏల లాగిన్‌లో అప్‌లోడ్ చేయగా ప్రభుత్వం వాటిని ఆర్టీజీఎస్ ద్వారా తనిఖీ చేసి వారిలో 6310మందిని లబ్ధిదారులుగా గుర్తించిందన్నారు. లబ్ధిదారుల జాబితాలలో పేర్లున్న రైతులకు వీఏఏలు సమాచారం అందిస్తారని, వారంతా వెంటనే ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. రెండు, అంతకంటే ఎక్కువ చోట్ల పొలాలు ఉన్న రైతులకు వాటిలో ఒకచోట మాత్రమే ఈకేవైసీ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న రైతులు రాష్ట్రవ్యాప్తంగా వారికి దగ్గరలో ఉన్న రైతుసేవాకేంద్రానికి వెళ్ళి వీఏఏలను సంప్రదించి ఈ కేవైసీ నమోదుచేయించుకోవచ్చన్నారు. అర్హుల జాబితాల్లో పేర్లు లేని రైతులకు, ఈ కేవైసీ పూర్తయినా బ్యాంక్ ఖాతాల్లో నగదు జమకాని రైతులకు ప్రభుత్వం గ్రీవెన్స్‌లో పెట్టుకొనేందుకు మరోసారి అవకాశం కల్పిస్తుందన్నారు.

● బొల్లాపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదాత సుఖీభవ కోసం రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్ళి తమ పేరు లిస్టులో ఉన్నదో లేదో చూసుకొని రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకోవాలని రైతు సేవా అధికారి కోహిని శుక్రవారం తెలిపారు.